బ్రహ్మోత్సవాలకు ముస్తాబు


ముస్తాబైన మునిరంగస్వామి ఆలయం, మునిరంగస్వామి, నల్లారెడ్డి స్వామివారి విగ్రహాలు (ఇన్‌సెట్‌లో..)

- భక్తుల కొంగుబంగారం మునిరంగస్వామి
- నేటి నుంచి ఉత్సవాలు ప్రారంభం

భూత్పూర్: భక్తుల కోరికలు తీర్చే స్వామిగా ప్రసిద్ధి చెందిన శ్రీ మునిరంగస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభమై వారం రోజుల పాటు నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాలకు మండల ప్రజలతో పాటు మహబూబ్‌నగర్ జిల్లా నుంచి భక్తులు బ్రహ్మోత్సవాలకు వచ్చి తమ మొక్కులను తీర్చి వెళ్తుంటారు. ప్రతిఏటా మాఘ పంచమి రోజున మునిరంగస్వామి ఆభరణాలతో ఆలయంలోకి ప్రవేశిస్తారు. మునిరంగస్వామి ఆలయం విద్యుద్దీపాల అలంకరణతో ముస్తాబు చేశారు. ఆలయం ప్రాంగణంలో ప్రతిఏటా పదుల సంఖ్యలో వివాహాలు జరుగుతున్నందునా స్థానిక ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో నూతనంగా కల్యాణ మండపం నిర్మాణం చేశారు. భక్తులకు సౌకర్యార్థం నీటి సౌకర్యం ఏర్పాటు చేశారు.

కార్యక్రమ వివరాలు..
శుక్రవారం మునిరంగస్వామి ఊరేగింపు, 11న రథోత్సవం (తేరు), 12న శకటోత్సవం, 13న పుట్టసేవ, 14న స్వామి వారి ఉత్సవాలు, 15న కల్యాణోత్సవం, 16న పల్లకీసేవ, 17న అవభృత అభిషేకంతో బ్రహ్మోత్సవాలు ముగిస్తాయి.

పోలీస్ అధికారుల నంబర్ల మార్పు

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లా పోలీస్‌శాఖలో ఉన్నతాధికారుల నుంచి ఎస్‌ఐ వరకు ఫోన్ నంబర్లు మారాయి. అందరి నంబర్లు శుక్రవారం నుంచి మారుతాయని, వాటి స్థానంలో కొత్త ఫోన్ నంబర్లను కేటాయించినట్లు ఎస్పీ కె.నరసింహ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజలతో పాటు ఇతర శాఖల అధికారులు ఈ విషయాన్ని గమనించాలని, ప్రస్తుతం వినియోగిస్తున్న ఫోన్ నంబర్స్ ఈనెల 20వరకు మాత్రమే వాడుకలో ఉంటాయని పేర్కొన్నారు.

హోదా	సెల్‌నంబర్	హోదా	సెల్‌నంబర్
ఎస్పీ	87126 59300	రూరల్ సీఐ	87126 59313
ఏఎస్పీ	87126 59301	జడ్చర్లటౌన్ సీఐ	87126 59314
ఏఎస్పీ డీటీసీ జడ్చర్ల	87126 59302	జడ్చర్ల రూరల్ సీఐ	87126 59315
మహబూబ్‌నగర్ డీఎస్పీ	87126 59310	భూత్పూర్ సీఐ	87126 59316
వన్‌టౌన్ సీఐ	87126 59311	ట్రాఫిక్ సీఐ	87126 59317
టూటౌన్ సీఐ	87126 59312	ఉమెన్ సీఐ	87126 59318

భూకబ్జాలను అధికారులు పట్టించుకోరా?


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్

బాలానగర్: జిల్లాలో బీఆర్‌ఎస్ నాయకులు భూకబ్జాలకు పాల్పడుతున్నా పట్టించుకునేవారు కరువయ్యారని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్రశేఖర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. బాలానగర్ మండలంలో బీఆర్‌ఎస్ నాయకులు భూకబ్జాలకు పాల్పడుతున్నా అధికారులు చర్యలు చేపట్టకపోవడం విడ్డూరంగా ఉందని తెలిపారు. ప్రజల ఆస్తులకు భంగం కలిగితే కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుందని అన్నారు. మండల కేంద్రంలో ప్రభుత్వ చెరువుకు వచ్చే నాలాను సైతం కబ్జాచేసి ప్లాట్లు చేస్తున్నారని ఆరోపించారు. అధికారులు ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఇచ్చినందుకు ఓ వ్యక్తి ఇళ్లు కూల్చివేయాలని ఉత్తర్వులు ఇవ్వడం ఎంత వరకు సమజసమని అన్నారు. త్వరలోనే నియోజకవర్గంలోని అన్ని భూ ఆక్రమణలపై, ప్లాట్ల ఆణాక్రమణలపై ప్రజల ముందుకు వచ్చి వివరాలు వెల్లడిస్తానని స్పష్టం చేశారు. సమావేశంలో నాయకులు తిరుపతి, హరిసింగ్, నరేందర్ రెడ్డి, హన్మంత్‌నాయక్, మల్లేష్ యాదవ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

మహమ్మదాబాద్/గండేడ్: రాష్ట్రంలో ఎక్కడ చూసినా కాంగ్రెస్ పార్టీ హయాంలో చేపట్టిన అభివృద్ధే కనిపిస్తుందని పరిగి మాజీ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి చేపట్టిన హాథ్‌సే హాథ్ జోడో యాత్ర కార్యక్రమంలో భాగంగా గురువారం మహమ్మదాబాద్ మండలంలోని గాధిర్యాల్, చౌదర్‌పల్లి, మంగంపేట్, మొకర్లాబాద్, మహమ్మదాబాద్, నంచర్లగేట్, కొంరెడ్డిపల్లి, గండేడ్ గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో మోడీ, రాష్ట్రంలో కేసీఆర్ ఇద్దరూ కలిసి ప్రజల సొమ్మును దోచుకుంటున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ హయాంలో చేసిన అభివృద్ధి మాత్రమే రాష్ట్రంలో కనబడుతుంది తప్పా బీఆర్‌ఎస్ కొత్తగా చేసిందేమీ లేదన్నారు. డబుల్‌బెడ్రూం ఇళ్లు ఇస్తామని ప్రజలను ఎంతో మోసం చేశారని, దళితులకు మూడు ఎకరాల భూమి పత్తా లేకుండా పోయిందని విమర్శించారు. కొత్తగా దళితబంధు పేరుతో మరోసారి మోసం చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు కేఎం నారాయణ, నర్సింహారావు, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి రాములు, మండల సంయుక్త కార్యదర్శి రాఘవేందర్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు రాధారెడ్డి, నాయకులు జితేందర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడల్లో రాణించాలి


జిల్లా క్రీడాకారులతో ప్రతినిధులు

మహబూబ్‌నగర్ క్రీడలు: భారత్ వికాస్ పరిషత్ తెలంగాణ ప్రాంత ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి రెండు రోజులపాటు హైదరాబాద్‌లోని జింఖానా మైదానంలో జరిగే క్రీడాపోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటి పతకాలు సాధించాలని బీవీపీ ప్రతినిధులు అన్నారు. క్రీడాపోటీలకు వెళ్తున్న క్రీడాకారులను గురువారం జిల్లా కేంద్రంలో అభినందించారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో జరిగే రాష్ట్రస్థాయి క్రీడాపోటీల్లో జిల్లా జట్టు పాల్గొంటున్నట్లు తెలిపారు. పోటీల్లో రాణించి జిల్లాకు పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో భారత్ వికాస్ పరిషత్ జిల్లా అధ్యక్షుడు పి.రమేష్ చందర్, ప్రతినిధులు జి.పాండురంగం, భూషణ్‌పాండే, వీఎస్ఆర్‌కే ప్రసాద్, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపసర్పంచ్‌ల సమస్యలు పరిష్కరించండి


వినతిపత్రం అందిస్తున్న ఉపసర్పంచ్‌లు

నవాబుపేట: ఉపసర్పంచ్‌ల సమస్యలు వెంటనే పరిష్కరించాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు ఉపసర్పంచ్‌లు వినతిపత్రం అందించారు. గురువారం ఉపసర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాములునాయక్ ఆధ్వర్యంలో ఉపసర్పంచ్‌లు హైదరాబాద్‌లో మంత్రిని కలిసి వినతిపత్రం అందించారు. తమకు పంచాయతీల్లో కల్పిస్తామన్న అన్ని రకాల అధికారాలు వెంటనే అమలు చేసేలా చూడాలని కోరారు. అలాగే ఉపసర్పంచ్‌లకు గౌరవ వేతనం సైతం అందించాలని తెలిపారు. సమస్యలపై మంత్రి సానుకూలంగా స్పందించారని అన్నారు. మంత్రిని కలిసిన వారిలో సంఘం నాయకులు సంతోష్, బీమయ్య, రవికిరణ్ తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న రిలేదీక్షలు

కోయిల్‌కొండ: గార్లపహాడ్‌ను మండలంగా ప్రకటించే వరకు రిలే దీక్షలు కొనసాగిస్తామని మండల సాధన జేఏసీ నాయకుడు వెంకట్రామిరెడ్డి అన్నారు. గురువారం 18వ రోజు నిర్వహించిన రిలే దీక్షల్లో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం స్పందించి మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వెంకటేష్, రాజు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన సర్పంచ్‌లు

మహబూబ్‌నగర్ క్రైం: సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రణీల్‌చందర్ ఆధ్వర్యంలో 20మంది సర్పంచ్‌లు జిల్లా ఎస్పీ కె.నరసింహను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా సంచారిస్తుంటే పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని ఎస్పీ సూచించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడానికి ముందుకు రావాలన్నారు.

మార్మోగిన శివనామస్మరణ



నవాబుపేట: మండల కేంద్రంలోని పెద్ద శివాలయంలో కొనసాగుతున్న నూతన విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమం వైభవంగా సాగింది. ఈ సందర్భంగా విగ్రహాల దానయ దివాసంతో పాటు హోమం నిర్వహించారు. శుక్రవారం నూతన విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించనున్నట్లు పూజారి వైద్యమఠం రామేశ్వరయ్య తెలిపారు.

తెగుళ్ల నివారణకు జాగ్రత్తలు తప్పనిసరి



రాజాపూర్: రైతులు వరిపంటకు తెగుళ్లు సోకకుండా చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి నరెందర్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో రైతులు సాగు చేసిన వరి పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి దుంప తెగులు సోకినట్లు గుర్తించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. రైతులు భోజ్యా, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

ఎంవీఎస్ కళాశాలలో వర్క్‌షాప్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాకేంద్రంలోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో గణితం, గణాంకాల డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈసందర్భంగా రిసోర్స్‌పర్సన్లు రాఘవేంద్రశర్మ, ఎల్.సంపత్‌లు ప్రసంగించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పద్మావతి, పీయూ వీసీ ఓఎస్డీ మధుసూదన్‌రెడ్డి, హాజరయ్యారు.

క్షయ నిర్ధారణ పరీక్షలు

దేవరకద్ర: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం క్షయ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలో నుంచి వచ్చిన ప్రత్యేక మొబైల్‌లో రోగులకు ఎక్స్‌రేలు తీసి ఇతర పరీక్షలు నిర్వహించారు. పీహెచ్‌సీకి వచ్చిన వారిలో 118 మంది రోగులకు క్షయ వ్యాధి ఉండవచ్చనే అనుమానంతో 104 మందికి ఎక్స్‌రేలు తీసినట్లు వైద్యాధికారి శరత్‌చంద్ర తెలిపారు. మరిన్ని పరీక్షల కోసం రోగుల నుంచి శాంపిల్స్ సేకరించారనిపేర్కొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి కృషి

మరికల్: మైనార్టీల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం ఎన్నో పథకాలను అమలు చేస్తోందని జాతీయ మైనార్టీ కమిషన్ ఇన్‌చార్జ్ షాజిదాబేగం అన్నారు. పథకాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గురువారం మరికల్‌కు వచ్చిన షాజిదాకు బీజేపీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమెను బీజేపీ రాష్ట్ర నాయకుడు రతంగపాండురెడ్డి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, మండల అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. ప్రభాకర్‌వర్ధన్, తిరుపతిరెడ్డి, కొండయ్య, వేణు తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్ర కరపత్రం విడుదల

మరికల్: మండల కేంద్రంలో చిత్తనూరు ఇథనాల్ కంపెనీ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో పాదయాత్ర కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాలమూరు అధ్యయన వేదిక జిల్లా కన్వీనర్ వెంకట్రాములు మాట్లాడుతూ ఇథనాల్ ఫ్యాక్టరీ వల్ల మన్నెవాగు, రామన్‌పాడ్ డ్యాం తదితరాలు కలుషితమవుతాయని అన్నారు. కోయిల్‌సాగర్ నీళ్ల రైతులకు అందకుండా దోచుకుంటున్నారని ఆరోపించారు. సుదర్శన్, చంద్రశేఖర్, యాదగిరి, నాగరాజు, లక్ష్మయ్య, మురళి, రామచంద్రయ్య, మధు, కాలబాబు, తిరుపతయ్య, దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

అడిగేవారేరీ?

- ధర్మాపూర్ బాలికల హాస్టల్‌లో వార్డెన్ ఇష్టారాజ్యం
- కల్తీ నూనెతో వంటల తయారీ
- వారానికి ఒకటే గుడ్డు.. రెండే చికెన్ ముక్కలు
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ


ధర్మాపూర్‌లోని ప్రభుత్వ బీసీ బాలికల వసతిగృహం

మహబూబ్‌నగర్ రూరల్: విద్యార్థులకు నాణ్యమైన భోజనం, మెరుగైన విద్యాబోధన అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్నా.. ఆచరణలో అధికారుల అలసత్వం కారణంగా సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మెనూ ప్రకారం భోజనం అందించకపోగా, కల్తీ నూనెతో వంటలు చేస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారు. ఇదిమిటని ప్రశ్నించిన విద్యార్థులను హాస్టల్ వార్డెన్ దండిస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారని విద్యార్థులు వాపోతున్నారు.

వార్డెన్ ఇష్టారాజ్యం..
మహబూబ్‌నగర్ మండలం ధర్మాపూర్‌లోని బీసీ బాలికల వసతిగృహంలో వార్డెన్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లేని కారణంగా మంచినూనెతో వంటకాలు చేయాల్సి ఉండగా.. కల్తీ నూనెతో వంటలు చేస్తూ విద్యార్థినుల ప్రాణాల మీదకు తీస్తున్నారు. రోగాల బారినపడి అస్వస్థతకు లోనవుతున్నారు. మెనూ ప్రకారం భోజనం అందించాల్సి ఉండగా, అమలు కావడం లేదు. వారానికి రెండు రోజులు కోడిగుడ్లు, రెండు రోజులు పండ్లు, ఒకరోజు స్వీటు, మరోరోజు చికెన్‌తో భోజనం అందించాలి. వారానికి ఒకరోజు మాత్రమే ఒకగుడ్డు అందిస్తూ.. మరో గుడ్డును స్వాహా చేస్తున్నారు. చికెన్ కూడా కేవలం రెండు ముక్కలు మాత్రమే పెట్టిస్తున్నారు. అరటి పండ్లు అరకొరగానే ఇస్తున్నారు. కనీస నాణ్యత పాటించకపోవడంతో చాలా మంది విద్యార్థులు తినలేక పస్తులుండాల్సిన దుస్థితి నెలకొంది.

ప్రశ్నిస్తే బెదిరింపులు..
జిల్లా కేంద్రంలోని మరో హాస్టల్ వార్డెన్ ధర్మాపూర్ బీసీ హాస్టల్‌కు కూడా ఇన్‌చార్జ్ వార్డెన్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. హాస్టల్ నిర్వహణపై వార్డెన్‌ను విద్యార్థులు ప్రశ్నిస్తే బెదిరింపులకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వంటచేసే పనివాళ్లు సైతం ఇంటి వద్ద గతి లేక ఇక్కడకు వచ్చారని, పెట్టిందేదో తిని చావండంటూ హేళన చేసి మాట్లాడుతున్నారని విద్యార్థులు కన్నీటి పర్యంతమవుతున్నారు. ఈ విషయమై హాస్టల్ వార్డెన్‌ను ఫోన్‌లో వివరణ కోరడానికి ప్రయత్నించగా ఎంతకూ ప్రతిస్పందించలేదు.


కల్తీనూనెతో తయారు చేసిన వంట


నాణ్యత లేకుండా తయారు చేసిన పులిహోర

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోండి


కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

స్టేషన్ మహబూబ్‌నగర్: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అల్‌ఫైజ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు జహంగీర్‌బాబా కోరారు. కంటి వెలుగుపై జిల్లా కేంద్రం సద్దల్‌గుండ్ ప్రాంతంలో సొసైటీ ఆధ్వర్యంలో గురువారం ప్రజలకు అవగాహన కల్పించారు. కంటి వెలుగు కార్యక్రమం ప్రాధాన్యతను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా జహంగీర్‌బాబా మాట్లాడుతూ కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ గౌతమి, డాక్టర్ సువిత, పావని, కృష్ణవేణి, ఏఎన్ఎం బుజ్జి, లక్ష్మి, సావిత్రి, అరుణ, గౌతమి, అంగన్‌వాడీ టీచర్లు నిర్మల, రిజ్వాన, పద్మ, ఆర్‌పీ తదితరులు పాల్గొన్నారు.

చిన్నచింతకుంట: మండలంలోని అప్పంపల్లిలో కంటివెలుగు కార్యక్రమాన్ని పంచాయతీ కార్యదర్శి మమత గురువారం పరిశీలించారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో షిర్డీసాయి రథోత్సవం


జిల్లా కేంద్రంలో షిర్డీసాయి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలో షిర్డీసాయి బాబా ద్వితీయ రథోత్సవాన్ని గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మధ్యాహ్నం 2గంటలకు వెంకటేశ్వరకాలనీ సాయిబాబా మందిరం నుంచి రథోత్సవం ప్రారంభమై ప్రధాన రహదారి వెంట గడియారం చౌరస్తా, రాంమందిర్ చౌరస్తా, పాత గ్రంథాలయం, భగీరథ కాలనీ నుంచి పాల్కొండ సాయి మందిరం క్షేత్రం వరకు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. ప్రతి శనివారం సాయంత్రం 7గంటల నుంచి 9గంటల వరకు స్వామివారి శేజ్ హారతి ఉంటుందని తెలిపారు. రథోత్సవంలో షిరిడి సాయి సేవక్ భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవాలి


అల్పాహారం వడ్డిస్తున్న సర్పంచ్ జితేందర్‌రెడ్డి

గండీడ్: విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని సల్కర్‌పేట సర్పంచ్ జితేందర్ రెడ్డి సూచించారు. గురువారం మండలంలోని సలకర్‌పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక తరగతులకు వస్తున్న పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం అందించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ జి.రామలింగం, జీహెచ్ఎం కృష్ణవేణి పవార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు


యజ్ఞంలో పాల్గొన్న భక్తులు

బాలానగర్: మండలంలోని మోతీఘణపూర్‌లో శ్రీరామ లింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. గురువారం యాగాలు, అన్నదాన కార్యక్రమం, అఖండ దీపారాధన కార్యక్రమలను వేద పండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని పునర్నిర్మించిన సర్పంచ్, ఎంపీటీసీ, గ్రామ పెద్దలు, గ్రామస్తుల సహకారంతో సుందరంగా తీర్చిదిద్దారు. శుక్రవారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఉంటుందని గ్రామ పెద్దలు తెలిపారు.

షిరిడి సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠాపన..
మండలంలోని పెద్దాయపల్లి శివారులోని దుందుభీ తీరంలో వెలసిన అయ్యప్ప ఆలయ ప్రాంగణంలో శ్రీ షిరిడీసాయి బాబా విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో కన్నుల పండువగా సాగింది. గుండేడ్ సర్పంచ్ నర్సింహారెడ్డి కుటుంబ సభ్యుల సహకారంతో రూ.లక్ష వెచ్చించి ఆలయ నిర్మాణం, విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

నర్సరీల నిర్వహణలో నిర్లక్ష్యం తగదు


నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ జయరాములు

కోయిల్‌కొండ: మండలంలోని గ్రామ పంచాయతీల్లో చేపడుతున్న నర్సరీలను ఎంపీడీఓ జయరాములు గురువారం జమాల్‌పూర్, మోదీపూర్ గ్రామాల్లో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలకు తగిన మోతాదులో నీటిని, ఎరువులను అందించాలని సూచించారు. మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం చేయకుండా గడువులోగా మొక్కలను సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ నర్సయ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

11న కబడ్డీ టోర్నమెంట్

అడ్డాకుల: మూసాపేట మండలం వేములలో నెహ్రూ యువజన సంఘం ఆధ్వర్యంలో ఈనెల 11న జిల్లా స్థాయి కబడ్డీ టోర్నమెంట్ ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ అరుణా రఘుపతిరెడ్డి తెలిపారు. రెండు రోజుల పాటు పోటీలు జరుగుతాయని అన్నారు. ఆసక్తి గల వారు పేర్లను నమోదు చేయించుకుని పోటీల్లో పాల్గొనాలని కోరారు. విజేతలకు నగదు బహుమతులను అందజేస్తామని తెలిపారు.

ఎమ్మెల్యేపై ఆరోపణలు అవాస్తవం

భూత్పూర్: మండలంలోని అన్నాసాగర్ మాజీ సర్పంచ్ నీలిమ, ఆమె భర్త నర్సింహులు ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేసినందుకు నీలిమను సర్పంచ్‌గా అధికారులు తొలగించారని, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డిపై ఆరోపణలు చేయడం అవాస్తమని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అల్లం రాంకోటి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నర్సింహులు బుక్ కీపర్‌గా పనిచేస్తూ మహిళా సంఘాల నిధులు కాజేయడంతో అప్పట్లో మహిళా సంఘాల సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, జైలుకు వెళ్లినట్లు తెలిపారు. గత నెల 21న రూ.14లక్షల గ్రామ పంచాయతీ నిధులు దుర్వినియోగం చేసినందుకు అప్పటి కలెక్టర్ వెంకట్రావ్ నీలిమను సర్పంచ్ విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు వెల్లడించారు. భార్యాభర్తలు ఇద్దరు నిధుల దుర్వినియోగం చేసి ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డిపై ఉద్దేశ పూర్వకంగా ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. సమవేశంలో సర్పంచ్ రాజిరెడ్డి, మండల కోఆప్షన్ ఖాజ, ఎంపీటీసీ రజిత, వార్డు మెంబర్లు శ్రీనివాసులు, శశిబాబు, కేశవులు, షాకీర్, వెంకటేష్, బాలరాజు పాల్గొన్నారు.

పాఠశాలకు ప్రింటర్ వితరణ



నవాబుపేట: పూర్వ విద్యార్థులు రూ.25వేల విలువైన ప్రింటర్, జిరాక్స్ మిషన్‌ను వితరణ చేశారు. గురువారం మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాల 1995–96 విద్యా సంవత్సరం పదో తరగతి విద్యార్థులకు పాఠశాలకు అందించారు. ఇదే పాఠశాలలో చదివిన వారు వివిధ రంగాల్లో ఉన్నందునా వారు తమ పాఠశాలకు చేయుతనివ్వాలని, ప్రతి ఏడాది వివిధ రకాల వస్తువులు పాఠశాలకు అందిస్తూ వస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యాదయ్య, రాఘు, రాఘవేందర్, వెంకటేష్, శ్రీను, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

మిడ్జిల్: మండలంలోని వెలుగోమ్ములలో జరుపటి కృష్ణయ్య అనే వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందాడు. ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తక్షణ సాయం కింద రూ.5వేల నగదును పంపించారు. గురువారం టీఆర్ఎస్ నాయకులు మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. నాయకులు మాసయ్యగౌడ్, సాయన్న, పరుశరాములు, తిరుపతయ్య తదితరులు ఉన్నారు.

శ్రీశైలానికి పాదయాత్ర



చిన్నచింతకుంట: స్థానిక గ్రామానికి చెందిన శివభక్తులు నెలరోజుల పాటు నిష్ఠతో శివదీక్షను చేపట్టి గురువారం శ్రీశైలానికి పాదయాత్రగా బయలుదేరారు. గ్రామ శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఇరుముడులను కట్టి శివనామస్మరణ, భజన కీర్తనలను ఆలపిస్తూ బయలుదేరి వెళ్లారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



చిన్నచింతకుంట: మండలంలోని అప్పంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సహకారంతో ఆల రఘుపతి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అందించిన స్టడీ మెటీరియల్‌ను సర్పంచ్ సువర్ణ గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో రైతు సమన్వయ కమిటీ మండల కన్వీనర్ మన్నెంగౌడ్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు కుర్వశ్రీను, గ్రామస్తులు దేవేందర్‌రెడ్డి, శివరాజు, ఉపధ్యాయులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ ఆవిర్భావ దినోత్సవం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని పీఆర్టీయూ భవన్‌లో గురువారం సంఘం ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నారాయణగౌడ్, రఘురాంరెడ్డి మాట్లాడుతూ పంచాయతీరాజ్ ఉద్యోగులు ప్రారంభం నుంచి ఎంతో వివక్షకు గురవుతున్న నేపథ్యంలో 1971లో పీఆర్టీయూ సంఘం ప్రారంభించబడిందని, అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎన్నో సమస్యలకు పరిష్కారం దిశగా కృషి చేసిందన్నారు. అనంతరం రిటైర్డ్ ఉద్యోగులను సన్మానించారు. కార్యక్రమంలో సంఘం నాయకుడు గోపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.